క్లుప్తంగా

8న ముదిరాజ్ ఆత్మగౌరవ సభ

చిట్యాల : హైదరాబాద్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ముదిరాజ్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని చిట్యాల మండల తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బుంగపట్ల తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శి గుడిసె యాదయ్య పిలుపునిచ్చారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన మహాసభ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో కావలి శ్రీనివాస్, పీక వెంకన్న, నీలం లింగస్వామి, ఆకుల వెంకన్న, కోగూరు సత్యం, బైరబోయిన నర్సింహ పాల్గొన్నారు.

104 కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ టూటౌన్ : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 104 కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష ముగింపు సందర్భంగా డీఎంహెచ్‌ఓ కొండల్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 7న హైదరాబాద్‌లో వైద్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు 104 ఉద్యోగులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండెంపల్లి సత్తయ్య, యూనియన్ నాయకులు శ్రవణ్‌కుమార్, మజీద్‌అలీ, శివచరణ్, స్వప్న, వెంకటయ్య, సునీత, కళ్యాణి, లావణ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్ : మండలంలోని ఖాజీ రామారం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు యువతి ఎండీ అలీం మనమరాలు అమీరా వివాహానికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.20 వేలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, షబ్బీర్ బాబ, జూలకంటి సైదిరెడ్డి, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని పలివెల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గోసుకొండ నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి పంపిన రూ.15వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బాసరాజు యాదగిరి, చెరుకు శంకరయ్య, ఈదాలు, నాగరాజు, మల్లికార్జున్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా సైదులు



మునుగోడు : రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా మునుగోడుకు చెందిన ఉడుత సైదులు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండలంలోని 30 మంది రేషన్ డీలర్లు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వనం యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము సైదులు, కార్యదర్శిగా ఎర్రమాద శ్రీనివాస్, కోశాధికారిగా చెరుపల్లి పద్మ, సహాయ కార్యదర్శులుగా పిట్టల ప్రమీల, బోయపల్లి నర్సింహ్మలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులన వివరాలను తహసీల్దార్ నరేందర్‌కు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిట్యాల: పట్టణ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చిట్యాలకు చెందిన ఇస్తారి, సురేష్‌లు బైక్‌పై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు బైక్‌పై వస్తున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు క్రాసింగ్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం



ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గుండా శ్రీనివాసులు

శాలిగౌరారం : మండలంలోని గురుజాల గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని స్థానిక సర్పంచ్ గుండా శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నక్క శంకరమ్మ, మండల వైద్యాధికారి వెంకన్న, ఉప సర్పంచ్ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి మహేశ్, నాయకులు పొన్నబోయిన వెంకన్న, కమలాకర్, గణేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లున్నా.. బీళ్లుగానే పంట పొలాలు

- నిండుకుండలా మాధారంకలాన్ జంట చెరువులు
- నిర్లక్ష్య ధోరణిలో నీటి పారుదల శాఖ అధికారులు
- ముందస్తు ప్రణాళిక లేక వానాకాలం పంటకు విడుదల కాని సాగునీరు



మాధారంకలాన్ రామసముద్రం చెరువు కింద బీళ్లుగా మారిన పంట భూములు

శాలిగౌరారం : నీటి పారుదల శాఖ అధికారుల నిండు నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోని కారణంగా రైతులు ఒక పంట కాలాన్ని కోల్పోయారు. జంట చెరువుల నిండా నీరు ఉన్నా పంట సాగుకు నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగానే మారాయి.

1234 ఎకరాల సాగు విస్తీర్ణం

శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్‌లో రామసముద్రం చెరువు, నీల సముద్రం చెరువు అనే రెండు జంట చెరువులు ఉన్నాయి. ఆయా చెరువుల పూర్తి విస్తీర్ణం 615 ఎకరాలు. నీటి సామర్థ్యం 12 అడుగులు. ఆయా చెరువుల కింద అధికారికంగా మండలంలోని మాధారంకలాన్, ఇటుకులపహాడ్ గ్రామాలతోపాటూ నకిరేకల్ మండలం ఓగోడు గ్రామాలకు చెందిన 1234 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. వానాకాలం పంట సాగు ప్రారంభంలో జంట చెరువుల్లో కొంతమేర నీరు ఉన్నప్పటికీ వానాకాలం పంటకు నీటి విడుదల చేయలేదు.

శాలిగౌరారం ప్రాజెక్టు అడుగంటడంతో..

మండల కేంద్రంలోని శాలిగౌరారం ప్రాజెక్టుకు గొలుసుకట్టు చెరువులుగా అడ్లూరు పెద్దచెరువు, మాధారంకలాన్ రామ, నీల సముద్రం చెరువులు ఉన్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచ కాల్వకు గడచిన వేసవికి ముందే గండిపడడంతో ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరక అడుగంటింది. ఆగస్టు రెండోవారం వరకు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు చేరకపోవడంతో శాలిగౌరారం ప్రాజెక్టుకు గొలుసుకట్టుగా ఉన్న మాధారంకలాన్ చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరడం కష్టమని అధికారులు భావించారు. ఆయా చెరువుల నుంచి సాగునీటి విడుదల చేస్తే పంటకు సరిపడా సాగునీరు అందదనే భావనతో వానాకాలం పంటకు సాగు నీటిని విడుదల చేయలేదు. కానీ వర్షాలు సరిపడా కురవడం, ఎగువ ప్రాంతాల నుంచి జంట చెరువుల్లోకి భారీగా వరదనీరు వచ్చిచేరడంతో చెరువులు పూర్తిస్థాయి నిండి నిండు కుండలా కలకలలాడుతున్నాయి. అయితే ఇప్పటి వరకు సాగునీటి విడుదల జరగకపోవడంతో వానాకాలంలో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. ఫలితంగా రైతులు ఒక పంటకాలం తోపాటూ ఆర్థికంగా నష్టపోయారు.

నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నాం



వానాకాలం పంట సాగు సమయంలో చెరువుల్లో సరిపడా నీరు నిల్వ లేకపోవడంతో సాగుకు నీటిని విడుదల చేయలేకపోయాం. ప్రస్తుతం జంట చెరువులు పూర్తిస్థాయిలో నిండి ఉన్నాయి. యాసంగి పంట సాగుకు ముందస్తుగానే నీటిని విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

– జేరిపోతుల మంజుల, సర్పంచ్, మాధారంకలాన్

ఒక పంట కాలాన్ని కోల్పోయాం



మాధారంకలాన్ రామ నీల సముద్రం జంట చెరువుల కింద నాకు మూడెకరాల భూమి ఉంది. వానాకాలం పంటకు సాగునీటి విడుదల చేయకపోవడంతో ఉన్న పొలం మొత్తం బీడుగానే ఉంది. దీంతో పంట కాలాన్ని పూర్తిగా కోల్పోయి తీవ్రంగా నష్టపోయాం.

– నోముల యాదయ్య, రైతు, మాధారంకలాన్

యాసంగిలో ముందస్తుగా నీటిని విడుదల చేస్తాం



మాధారంకలాన్ రామనీల సముద్రం జంట చెరువుల్లో వానాకాలం పంట ప్రారంభంలో నీటి నిల్వ అత్యంత స్వల్పంగా ఉంది. వర్షాలు ఆలస్యంగా కురవడంతో పాటూ ఎగువన ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు సైతం అడుగంటి ఉండడంతో వానాకాలం పంటకు సాగు నీటి విడుదల సాధ్యం కాలేదు. యాసంగిలో ముందుగానే నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాములు, ఇరిగేషన్ ఏఈ, శాలిగౌరారం మండలం

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీపీ కర్నాటి స్వామి, జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణిరవి శుక్రవారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.భాస్కర్ గౌడ్, సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఎంపీటీసీలు బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్, ఈద నిర్మల శరత్‌బాబు, ఉప సర్పంచ్ పందుల పవిత్ర శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..



చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ : మహిళలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీలకు మంజూరైన 10,479 బతుకమ్మ చీరలను మర్రిగూడ, శివన్నగూడ, రాజాపేట తండా, కుదాబక్షపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో శుక్రవారం మహిళలకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం శివన్నగూడలో వైకుంఠధామాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్‌లు నల్ల యాదయ్య, చిట్యాల సబితాయాదగిరిరెడ్డి, నూన్సావత్ సక్కుబాయిభిక్షా నాయక్, ఆంబోతు సుధాకర్‌నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ యాకుబ్, ఎంపీఓ యూసుఫ్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

14న ఎంగిలిపువ్వు బతుకమ్మ

శాలిగౌరారం : మండల ప్రజలు ఈ నెల 14న ఎంగిలిపువ్వు బతుకమ్మ, 23న విజయదశమి(దసరా) పండుగలను జరుపుకోవాలని శాలిగౌరారం మండల వైదిక బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు వెల్లడించారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన వైదిక బ్రాహ్మణ పరిషత్ ముఖ్య ప్రతినిధుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. వావిలాల వేణునాథశర్మ, రామడుగు వెంకటరామశర్మ, కొడవటికంటి సుబ్రహ్మణ్యశర్మ, కొండగడప వెంకటేశ్వరశర్మ, కోడూరు ప్రశాంత్‌శర్మ, వావిలాల రామలింగయ్యశర్మ, పులి రామకృష్ణశర్మ, ఇరుగంటి లక్ష్మినర్సింహశర్మ, జీవన్ వెంకటేశ్వరశర్మ, జయరాములుశర్మ, లక్ష్మిప్రసాద్‌శర్మలు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయం

నల్లగొండ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యువసేన జిల్లా అధ్యక్షుడు మామిడి కార్తీక్, ప్రధాన కార్యదర్శి పాదం అనిల్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యువసేన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపు కోసం యువసేన విస్తృతంగా ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాంపల్లి అంజన్‌కుమార్, సిద్ధు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఆరోగ్య మిత్ర సేవలు

నార్కట్‌పల్లి : కామినేని ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర సిబ్బంది చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లడంతో శుక్రవారం ఆరోగ్య మిత్ర సేవలు నిలిచిపోయాయి. సిబ్బంది విధులకు రాకపోవడంతో రోగు ఇబ్బందులు పడ్డారు.

అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం పెద్ద పీట



తిప్పర్తి మండలంలో గృహలక్ష్మి ప్రొసీడింగ్, బతుకమ్మ చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ రూరల్ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం అందజేసిన చేప పిల్లలను శుక్రవారం దోమలపల్లి చెరువులో ఆ గ్రామ సర్పంచ్ ఉపేంద్రచారి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, మత్స్యశాఖ అధికారి వెంకయ్యలతో కలిసి చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల పెంపకంతో వృత్తిదారులంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. చేపలు పట్టే వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సైదులు యాదవ్, మల్లేష్ గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ తవిటి కృష్ణ, బడుపుల శంకర్, గంగపుత్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగం కృష్ణయ్య, అంబటి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ కాలనీలో విద్యుత్ లైట్లు ప్రారంభం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని 3వ వార్డు ఎఫ్‌సీఐ కాలనీలో రూ.32 లక్షలతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను శుక్రవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 60 స్తంభాలతో ఎఫ్‌సీఐ కాలనీలో పూర్తిస్థాయి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎఫ్‌సీఐ కాలనీని ఎవరూ పట్టించుకోలేదని, తాను ఎమ్మెల్యే అయిన తరువాతనే కాలనీలో రోడ్లు, తాగు నీటి సరఫరా, కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ పేర్ల జానయ్య, జనార్దన్‌రావు, సీపీఎం నాయకులు హాషం, ఎండీ. సలీం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించి ఆడబిడ్డలను గౌరవించి వారికి బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ పట్టణం, మండలంలోని మహిళలకు బతుకమ్మ చీరలు, లబ్ధిదారులు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు, యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి, అభిమన్యు శ్రీనివాస్, దేప వెంకట్‌రెడ్డి, బకరం వెంకన్న, గాదె రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్ అందజేసిన ఎమ్మెల్యే

పట్టణంలోని 41వ వార్డులో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శుక్రవారం ప్రొసీడింగ్స్, బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షురాలు యటా జయప్రద తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి

రామగిరి(నల్లగొండ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు ఆర్థికంగా బలోపేతమై అభివృద్ధి చెందాయని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని చిన్నాయిగూడెం ఫంక్షన్ హాల్‌లో బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్స్, గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, వనపర్తి నాగేశ్వర్‌రావు, కందుల రేణుకలక్ష్మయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి, వీరేశంలకు ఘన స్వాగతం



చిట్యాల : నర్రా రాఘవరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

చిట్యాల : కాంగ్రెస్ పార్టీలో చేరిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి ర్యాలీగా చిట్యాల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా వెలిమినేడులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిట్యాలలో కాంగ్రెస్ నాయకులు వారికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. వట్టిమర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జడల చినమల్లయ్య, కాటం వెంకటేశం, బండ కృష్ణయ్య, అంతటి వెంకటేష్‌గౌడ్, ఆవుల యాదయ్య, నర్రా మోహన్‌రెడ్డి, గోలి గణేశ్, దేశబోయిన మల్లమ్మ, అంతటి పారిజాత, నర్సింహ, కాటం సత్తయ్య, ఏర్పుల పరమేష్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : హైదరాబాద్ నుంచి నకిరేకల్ వెళ్తున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంలకు నార్కట్‌పల్లి మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. నార్కట్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మండల కేంద్రంలోని మునుగోడు చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికి అమ్మనబోలు చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, జేరిపోతుల భరత్, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి కొంపెల్లి సైదులు, ఉంద్ర భాగ్యమ్మ లింగారెడ్డి, సర్పంచ్‌లు మల్లేషం, శంకర్, చంద్రశేఖర్, కొండయ్య, రాజు, నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, మాజీ సర్పంచ్‌లు సిద్దగోని స్వామి, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, మట్టిపల్లి శ్రీను, ప్రజ్ఞాపురం సత్తి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలి

నాంపల్లి : నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నేతలు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం 23వ రోజుకు చేరాయి. ఋషిపాక నర్సింహ, గాదెపాక వేలాద్రి, కోరె సాయిరాం, నాంపల్లి చంద్రమౌళి, పులకరం వెంకటయ్య, మల్లయ్య, లక్ష్మీనారాయణ, జి.నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

చెర్వుగట్టులో పూజలో పాల్గొన్న రేగట్టె

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి.బాలమ్మ ప్రత్యేక పూజలు చే శారు. అర్చకులు వారిని ఆశీర్వదించి సన్మానం చే శారు. వారి వెంట గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



బంగారిగడ్డ హైస్కూల్‌లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

మునుగోడు : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు పక్కా రోడ్ల నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి రాష్ట్రంలోనే మునుగోడును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మునుగోడులోని సానబండకు మంజూరైన బీటీ రోడ్డుతోపాటు చొల్లేడు, లక్ష్మీదేవిగూడెం, కొరటికల్ వాగులపై వంతెనల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి గ్రామానికి పక్కా బీటీ రోడ్డుతోపాటు వాగులపై వంతెనల నిర్మాణానికి దాదాపు రూ. 150 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లువేసి తిరిగి కేసీఆర్‌ని సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, పంచాయతీరాజ్ డీఈ రఘుపతి, సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జనిగల మహేశ్వరిసైదులు, వల్లూరి పద్మలింగయ్య, ఎంపీటీసీలు ఈద నిర్మలశరత్‌బాబు, వనం నిర్మలయాదయ్య, మందుల లక్ష్మమ్మబీరప్ప, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి, నాయకులు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, పందుల శ్రీను, దుబ్బ రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపానికి చెక్ పెట్టేందుకే బ్రేక్‌ఫాస్ట్ పథకం

చండూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహార లోపాన్ని చెక్ పెట్టేందుకే సీఎం కేసీఆర్ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేశారని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరు మండలం బంగారిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే చిన్నారులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, సర్పంచు పల్లె వెంకటేశం, ఎంపీటీసీ పల్లె వెంకన్న, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, ఎంఈఓ గురువారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం చండూరులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ధనంజయ్య, పల్లె కవిత, లక్ష్మమ్మ, యాదమ్మ, మరియమ్మ, సీత యాదమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నకిరేకల్ : బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అయిటిపాముల, రామచంద్రాపురం గ్రామాల్లో రూ.41 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, సర్పంచ్ నూరారపు ప్రియాంకగణేశ్, ఎంపీటీసీలు బెల్లి మహాలక్ష్మి సుధాకర్, నల్లమాద వీరమ్మసైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, నర్సింగు రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి చదువుతోపాటు ఉదయాన్నే విద్యార్థుల కడుపు నింపడం కోసం సీఎం కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రతిరోజు అల్పాహారం అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ బాలాజీ, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీ, ఎంపీడీవో అండాలు, ఎంఇవో నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీ, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, సర్పంచ్ అబ్బగోని విజయలక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ స్వరూప

చిట్యాల : గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్లలోని విద్యుత్ పరికరాలు చెడిపోతున్నాయని వెంటనే సమస్యను పరిష్కరించాలని చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొలను సునిత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళన చేశారు. పిట్టంపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ లోఓల్టేజీతో సుమారు యాభై ఇళ్లలోని టీవీలు, సీలింగ్ ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు పాడైపోయాయని ఆ గ్రామ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు ఉన్నప్పుడు విద్యుత్ సిబ్బంది ఫోన్ ఎత్తడం లేదని ఉరుమడ్ల సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలికట్టె, గుండ్రాంపల్లి గ్రామాల్లో నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ గొలనుగొండ దశరథ, సర్పంచ్ రత్నం పుష్ప కోరారు. గ్రామాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలను అందజేస్తామని ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి సభ్యులకు సమాధానం ఇచ్చారు. ఎలికట్టె గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ దశరథ, సుంకెనెపల్లిలో సీసీ రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ కక్కిరేణి బోందయ్య కోరారు.

ప్లకార్డులతో ఎంపీటీసీ నిరసన

నాలుగున్నరేళ్లుగా మండల పరిషత్ ఆదాయ, వ్యయ వివరాలు తెలపడం లేదంటూ వెలిమినేడు-1వ ఎంపీటీసీ సభ్యురాలు దేశబోయిన స్వరూప సమావేశ ప్రారంభ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీంతో మండల పరిషత్ ఆదాయ వ్యయాలకు సంబంధించి ఈ నెల 12వ తేదీన మరోసారి సమావేశం నిర్వహిస్తామని ఎంపీపీ కొలను సునిత హామీ ఇవ్వటంతో ఎంపీటీసీ సభ్యురాలు ఆందోళన విరమించారు.

హాజరు కాని అధికారులు, ప్రజాప్రతినిధులు..

శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండలంలోని 18 గ్రామాలకుగాను 5 గ్రామాల సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. 12 మంది ఎంపీటీసీలగాను 8 మంది హాజరయ్యారు. ఎంపీడీఓ హాజరు కాకపోగా ఎంపీఓ పద్మ, తహసీల్దార్‌కు బదులు నాయబ్ తహసీల్దార్ రాగ్యానాయక్ హాజరయ్యారు. పీఆర్‌ఏఈ, ఐబీ ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈలు హాజరు కాలేదు. వైస్ ఎంపీపీ మర్ల అలివేలు, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ హాజరయ్యారు.

కొనసాగుతున్న ఆశా వర్కర్ల సమ్మె



కట్టంగూర్ : రాస్తారోకో చేస్తున్న ఆశావర్కర్లు



నాంపల్లి : రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని సర్వీసు రోడ్డుపై ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు పాల్గొని మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురారి మోహన్, జాల రమేష్, తవిటి వెంకటమ్మ, చెవుగోని ధనలక్ష్మి, రేణుక, పార్వతమ్మ, సుజాత, సంధ్య, కంకణాల శోభ, నాగమ్మ, యాదమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

నాంపల్లి : తమ డిమాండ్లను ప్రభుత్వం తీర్చేవరకు పోరాటం ఆగదని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు రమావత్ కవిత అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఆశా వర్కర్లు రోడ్డుపై రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు కనీసం వేతనం ఇవ్వాలని కోరారు. రోడ్డుపై భారీగా వాహనాలు నిలవడంతో పోలీసులు ఆశా వర్కర్లను చెదరగొట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కవిత, సునిత, లలిత, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, అండాలు, సైదమ్మ, అనిత, రాధిక, నాగమ్మ, భాగ్యమ్మ, రేణుక, పద్మ, రజిత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్ల చేస్తున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, జంపాల వసంత, కాలం సుజాత, జాజాల అనిత, కోయ మంజుల, పందుల పద్మ, ఎస్‌కె.సైదాబేగం, లపంగి దుర్గమ్మ, కౌసల్య, బాలమణి, అలివేలు మంగమ సునీత, వెంకటమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

రూ.18వేలు వేతనం ఇవ్వాలి

కేతేపల్లి : ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఆదిమళ్ల సుధీర్ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కేతేపల్లిలో పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ పాల్గొని మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఈఎస్‌ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, బీమా సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆశా కార్యకర్తలు సునీత, ఆదిలక్ష్మి, లక్ష్మి, రేణుక, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.